తెలుగు కళాసమితి (న్యూజెర్సీ)వారి ఉగాది మినీ కథల పోటీలో రు. 300 గెలుపొందిన రచన

# వుజ్జోగం

సంఘమిత్ర



''వీడేనా అప్పలాజు'' దొరగారు స్టూలు మీదున్న కుడికాలు తీసి, ఆ స్థానే ఎడమ కాలు పెడుతూ సూరమ్మను అడిగారు.

సూరమ్మ అవునన్నట్లు తలవూపింది.

రామయ్య స్టూలు మీదున్న దొరగారి ఎడమ కాలిని అందుకుని, నూనె పట్టించి 'మాసాజ్' చేస్తున్నాడు.

సూరమ్మ పక్కనే ఒదిగి నిల్చున్న అప్పలాజు రామయ్య చేతికి పట్టు దొరక్కుండా తప్పించుకుంటున్న దొరగారి ఎడమ కాలి పిక్కల్ని చూస్తూ నిల్చున్నాడు.

''ఏం చదివాడు?'' దొరగారు అప్పలాజుని చూస్తూ సూరమ్మను ప్రశ్నించారు.

''సదువబ్బనేదు దొరా! ఏడు సదివి మానీసేడు. యీడయ్య పోయిన కాడ్నించి శానా యిబ్బందిగుంది. పెబువులు దయసూపాల'' —

''నీకు తెల్దేటే సూరమ్మా, అయ్య వుజ్జోగం యిడికిప్పించనానికి దొరగోరు శానా కష్టబడ్డారు,'' హమయ్య మధ్యలో అందుకున్నాడు.

సూరమ్మ దొరగార్ని కృతజ్ఞతాపూర్వకంగా చూస్తూ నిల్చుంది.

దొరగారు 'నెపమెన్నక ఉపకారము చేయు నేర్పరిలా' చిన్నగా నవ్వారు.

''సర్లే! రేపట్నుండి పన్లో జేరు. ఇంట్లో అమ్మగారికి సాయంగా వుండాలి. ఏ పని చెప్తే ఆ పని చేస్తుండాలి'' — అప్పలాజుని చూస్తూ దొరగారన్నారు.

సూరమ్మ సంబరపడిపోయింది. అప్పలరాజు కూడా సంతోషించాడు. గవుర్నమెంటుజ్జోగవంటే నెలకి బోల్డు జీతం, చలవులు వుంటై. జబ్బు సేత్తే మందూ, మాకూ కరుసు లాలే యిచ్చుకుంట్రు'' అప్పలాజుకు మేస్త్రీ గురవయ్య చెప్పింది జ్ఞాపకం వచ్చింది.

సూరమ్మ దొరగారి వద్ద శలవు తీసుకుంది. అప్పలాజు వెళ్తూ, దొరగారికి చేతులు జోడించి దండం పెట్టాడు.


''యిదిగో రారే, అప్పలాజా'' రామయ్య కేక వేశాడు.

''ఆర్డు కాగితం వొగ్గేసేవు. యిది నీ కాడే వుంచుకోవాల. శానా బద్రం సుమీ'' — రామయ్య అప్పలాజు చేతికి ఓ కవరందించాడు.

సూరమ్మ అప్పలాజు చేతుల్లోంచి ఆ కవరు తీసుకుని, జాగ్రత్తగా మడిచి, కొంగులో కట్టి బొడ్లో దోపుకుంది.

* * *

అప్పలాజు ఉద్యోగంలో చేరి మూడ్రోజులైంది. రామయ్యది పక్క వీధే. ఉదయాన్నే వచ్చి కేక వేస్తాడు. అప్పలాజు తయారుగా వుండాలి. ఇద్దరూ కలిపి ముందు ఆఫీసుకు పోవాలి. అక్కడ మస్తరు చెప్పాలి. తరువాత రామయ్యతోపాటు దొరగారింటికి రావాలి. అప్పలాజు దొరగారు చెప్పినట్లు అమ్మగారికి సహాయంగా వుంటున్నాడు. దొరగారి



## రచయిత స్వపరిచయం

ఆంగ్ల సాహిత్యంలో ఆంధ్ర యూనివర్సిటీ వారిచ్చిన ఎమ్మే డిగ్రీ, విశాఖ పోర్టు ట్రస్టు స్టోర్సు డిపార్టుమెంట్లో ఉద్యోగం- వ్రాయాలనే వుద్దేశం చాలాకాలంగా వుంటున్నా, "సంఘమిత్ర" కలం పేరుతో వ్రాయడం ప్రారంభించింది ఈ మధ్యనే. బహుమతిగా నిల్చిన ఆంధ్రజ్యోతి ఆశీస్సులు, ప్రోత్సాహమిచ్చిన న్యాయ నిర్ణేతల నిర్ణయం- రచయితగా నా బాధ్యతల్ని స్పష్టీకరించాయి. ఆ బాధ్యతల్ని నిర్వర్తించే ప్రయత్నం చేసేందుకు మాటిస్తూ,

—'సంఘమిత్ర', విశాఖపట్నం

పిల్లలకు స్నానం చేయించడం, బట్టలు తొడగడం, స్కూలు వరకు దిగబెట్టడం, కూరగాయలు తీసుకు రావడం, వగైరా పనులు చేయవలసి వుంటుంది. అంతవరకూ అప్పలాజుకు బాగానే వుంది. చంటి పిల్ల — దొరగారి ఆఖరి అమ్మాయి ఏడిస్తే ఎత్తుకుని తిప్పడం, అది అశుభ్రం చేసిన బట్టల్ని ఉతకడం వంటి పనుల్ని మాత్రం ఎలా చేయాలో అర్థం కావడంలేదు. అప్పలాజు రామయ్యను అదే ప్రశ్నించాడు.

"సర్పరి, సంటిపిల్ల దొడ్డి గుడ్డ లుతకలేనంటు న్నావా? మీ అయ్య సేసీవోడు. నేను కూడా సేసీవోడ్నే, తప్పేం నేదు" రామయ్య సమాధాన మిచ్చాడు.

అవును. అప్పలాజు గమనిస్తున్నాడు. రామయ్యే కాదు, ఆ ఇంట్లో వున్న మరో యిద్దరు కూడా మస్తరు చెప్పి, దొరగారింటికి వచ్చేస్తారు. ఆ పనీ, ఈ పనీ తేడా లేకుండా దొరగారు, అమ్మగారు ఏ పని చెబితే అది సిగ్గూ, అసహ్యం లేకుండా చేస్తున్నారు. మరేమో మొన్న మేస్త్రీ గురవయ్య "గవర్న మెంటుజ్జోగులు ఆఫీసులంటా, కంపెనీ లంటా వుంట రు.యిలాటి లేకి పన్లు సెయ్యరు" అని చెప్పాడు. అప్పలాజు అదే మాట రామయ్యతో అన్నాడు.

"ఆడి మొకం, ఆడికేటి తెల్సు? కూలిముండా కొడుకు" రామయ్య కసిరేడు.

అప్పలాజుకు రామయ్య సమాధానం రుచించ లేదు. 'అయితే ఈ గవర్నమెంటుజ్జోగంలో పెద్దాఫీచర్ల యిల్లకాడ పన్లు సెయ్యాల్సిందేనన్నమాట' — అప్పలాజు అనుకున్నాడు. 'అంతే, అంతే!' అప్పలాజుకు సూరమ్మ కనిపించింది.

మరైతే మేస్త్రీ చెప్పిందంతా అబద్ధమేనా?

*        *        *

మూడో రోజు సాయంత్రం —

అప్పలాజు యింటికొచ్చిందే తడవుగా, వంటి మీది గుడ్డల్ని గబగబ విప్పి ఉతకడం ప్రారంభించాడు.

"రోజూ ఈ ఉతుకునేట్రా, మీ అయ్య సేసీ వోడు కాడా వుజ్జోగం? శనోరం గుడ్డలు కడ్తే మళ్ళీ శనోరం వచ్చిదాకా అయే!" సూరమ్మకు కొడుకు ధోరణి నచ్చలేదు.

"ఏం సెయ్యమంటావే. ఆ గుంటది రోజూ గుడ్డల్ని కరాబు సేత్తోంది. సెంక దింపితే ఏడుపు. ఆలయ్య నాగే సవారి బాగా మరిగింది. గుంటదేడిస్తే సాలు, ఆ యమ్మగోరికి కోపం " అప్పలాజు విసుక్కున్నాడు.

మేస్త్రీ గురవయ్యొచ్చాడు "అప్పనాజూ! ఏటి సేత్తనావురా" అంటూ.

"రా మేస్త్రన్నా. సూడీడి సోద్దెం. సంటిగుంటని సెంకనేసుకోవడం నీతో రోజంతా రాల్లు మొయిడం కన్న కట్టవైనట్టు సెప్తుండు" సూరమ్మ మేస్త్రీ గురవయ్యతో ఫిర్యాదు చేసింది.

"నాల్రోజునాగు, సూత్తుండు. ఆడే సదురు కుంటడు" మేస్త్రీ నవ్వుతూ, అప్పలాజు తల్లికి ధైర్యం చెప్పాడు.

మేస్త్రీ గురవయ్య కాసేపు ఆ మాటా, ఈ మాటా చెప్పాడు. అప్పలరాజుకు మేస్త్రీ చెప్తున్నదేం వినిపించడం లేదు. వుండుండి మధ్యలో అందు కున్నాడు.

"గవున్నమెంటోల్లన్నవే, ఆళ్ళెవరో నీ కెరికా?"

సందర్భం లేకుండా అప్పలాజు వేసిన ప్రశ్నకు మేస్త్రీ వాక్ప్రవాహం ఆగింది.

"ఎవ్వలా?" మేస్త్రీ అడిగాడు.

"అదే మీ వూరొచ్చినారని సెప్పేవు"

"ఆ! ఆ!" మేస్త్రీ జ్ఞాపకం తెచ్చుకున్నాడు.

"నాకు మాతరం ఏటెరికిరా! ఆ యేళ గవున్న మెంటు ఆఫీచర్ల మంజెప్పి మా వూరొచ్చి, యీడెవరైనా 'కంబారితనం' సేస్తంద్రా అనడిగినార్రా. మాం ఒక పదిమంది ముంటం. పేర్లడిగి, మా కామందుల్తో ఏటో సెప్పారు. కాయితాలు రాయించినారు. తర్వోత మాకాల్తో ఎనాటి చంబందం లేదనీ, గవున్నమెంటు ఆర్డు పెకారం మేం యిడుదలైపోనామని సెప్పోరు. అంతేన్నా-నానీ వూరు పారొచ్చి తాపీ పని నేర్చినాను" మేస్త్రీ చెప్పాడు. మేస్త్రీ యిదివరలో ఈ కథ అప్పలాజుకు చాలా మార్లు చెప్పాడు.

అప్పలాజు నవ్వాడు. "సీ! నువ్వొత్తి కూలి ముండాకొడుకువి. నీకేటీ తెల్దు" అన్నాడు.

*        *        *

మర్నాడుదయం మేస్త్రీ పనికి పోవడానికి తయారై తాపీ, గజం బద్ద అందుకుని ముంజూరు దాటుతున్నాడు.

"గురవయ్య మావా!" అప్పలాజు పిల్చాడు, బయట నిల్చుని.

మేస్త్రీ అప్పలాజును చూశాడు. భుజాన చిన్న పలుగుంది. దానికో చిన్న మూట వ్రేలాడుతోంది. నిబ్బరంగా నవ్వుతున్నాడు.

అప్పలాజు మీద మేస్త్రీకి రాత్రి నుండి బాగా కోపంగా వుంది. "కూలి ముండాకొడుకేని తిట్టి, నీకేటీ తెల్దు" అన్నందుకు.

అప్పలాజు నవ్వుతూనే అన్నాడు. "గవున్న మెంటుజ్జోగం మానీసేను. గవున్నమెంటిచ్చిన జీతం డబ్బుల్కి దొరగారింటికాడ అడ్డమైన సాకిరీ సెయ్యడం నా సేతకాదు."

మేస్త్రీ ఏం మాట్లాడలేదు. అతడికి అప్పలాజు సంగతి తెలుసు. అయితే, మేస్త్రీకి ఒక విషయం అర్థం కాలేదు. 'ఊరూరూ తిరిగి కంబారోల్ని కామందుల కాడ్నుండి యిడుదల సేయిత్తున్న గవున్న మెంటోల్లు శానా శానా మంచోల్లే. మరైతే యీ దొరల్నింగతేటి? కామందుల కన్నా యీల్లు యేడాకు లెక్కువే సదివినట్టున్నారు. గవున్నమెంటోల్ల కీల్ల చంగతి తెల్దా? అప్పనాజు లాంటి వుజ్జోగుల్నేత దొర్లు అడ్డమైన సాకిరీ సేయించుకోడవేటి?'

అప్పలాజుకు మేస్త్రీ ఆలోచనలు అర్థ మయ్యాయి. "అదంతేలే మావా! మనం సేత్తేనే కద, ఆల్లు సేయించుకుంట్రు" అన్నాడు. *

